ట్రింగ్..ట్రింగ్...

"హలో ఎవరూ? 'షాక్ తిన్నారా' నుండి సుష్మగారా...నమస్తే అండీ! అబ్బా...మీ ఫోన్ కోసం నాలుగు నెలల నుండి ఎంత ఎదురుచూస్తున్నానో చెప్పలేను. నా పేరు లతండీ. వైజాగ్...టీవీ సౌండ్ కొంచెం తగ్గించాను...." తనకు సుత్తి కొట్టే ఛాన్స్ లేకుండా చేసినందుకు లత మీద యాంకరమ్మకు లోలోపల మండుకొచ్చినా తప్పనిసరి చిరునవ్వుతో-

"ఆ...నమస్తే అండీ! ఇంతకుముందు కాలర్ ఏమి గెలుచుకున్నారో చెప్తారా?" అంది ముక్తసరిగా.

"అదీ....అదీ..." ఆ తడబాటుకి యాంకరమ్మ ముఖం చాటంతై 'అహ..చిక్కింది చేప..' అనుకుంటూ-

"హలో లతగారేనా? ఏంటీ...టీవీ చూడ్డం లేదా? కరెంట్‌పోయిందా...సారీ..మళ్ళీ ఎన్‌రోల్ చేయించుకోండి..కాల్ చేస్తాను"తన్నుకొచ్చాయి గొంతులోని మాటలు...అలవాటైన ధోరణిలో.

లత బిడియంగా "అబ్బే... అది కాదండీ! ఇప్పుడే అలా బాత్‌రూమ్‌కి వెళ్లానో లేదో మీ ఫోన్. విషయం అర్థమైన యాంకరమ్మ మందు ఫక్కున నవ్వినా తర్వాత గంభీరంగా "సారీ అండీ! మీరు ఎందుకు చూడలేదన్నది మాకనవసరం. రూల్స్ అంటే రూల్సే. మళ్లీ ఎన్‌రోల్ చేయించుకోండి" కళ్ళముందు చుక్కలు కనిపించాయి లతకి.

"మళ్ళీనా...ఇన్ని నెలల నుండి మధ్యాహ్నం గంటసేపు బల్లిలా టీవీకి అతుక్కుపోయి మొగుడు, పిల్లల్ని కూడా భోజనం వాళ్లనే వడ్డించుకోమని చెప్పి ఫంక్షన్స్‌కి కూడా ఎక్కడా హాజరు వేసుకోకుండా పత్తికాయల్లా కళ్ళు విప్పార్చుకుని కూర్చోనుంటే..." ఆక్రోశం కాస్తా ఆవేశంగా మారింది.

"హలో...సుష్మాగారూ...ఒక్క నిముషం..."క్షణకాలం ఊపిరి బలంగా పీల్చి వదిలి-

"అసలు ఈ దిక్కుమాలిన ఐడియా వచ్చిన వాళ్ళ కాలర్ పట్టుకోవాలి ముందు. ఫ్రీగిఫ్ట్ అనేసరికి సహజంగా ఎవరికైనా ఉండే ఆశను ఆసరా చేసుకుని మీ ఛానెల్ రేటింగ్‌ని పెంచుకోవడానికి ఇలా తప్పనిసరిగా కూర్చోబెట్టి విలువైన మా టైమ్‌ని మింగడమే కాకుండా ప్రేక్షకుల మనసులతో చెలగాటం ఆడుతుంటారా?

ఖాళీ ఉంటే చేస్తాం. లేకుంటే లైన్ కలవకపోతే ఇంకో రోజు చేస్తాం. ఇకముందైనా ఇలా ప్రేక్షకుల్ని టార్చర్ చేసే ప్రోగ్రామ్‌ని ఎత్తేయడమో లేదా మార్పులు చేయడమో చెయ్యకపోతే బాధితుల కడుపుమంటకి మీ ఛానెల్ రేటింగ్ ఎటో పోతుంది జాగ్రత్త" ఫోన్ పెట్టేసింది విసురుగా పళ్ళు నూరుతూ.

లత ఉగ్రరూపానికి ఇటు భర్తా పిల్లలు షాక్ తినగా, ధన్‌ధన్‌మని కొండచరియలు విరిగిపడినట్లున్న ఆ వాగ్ధాటికి అటు యాంకరమ్మ కూడా షాక్ తింది.

చూస్తున్న ప్రేక్షకులు మాత్రం తెగ సంబరపడ్డారు ఎవరో ఒకరు బుద్ధి చెప్పే ప్రయత్నం చేసినందుకు.

★

# బుద్ధి తెచ్చుకోండి

-కొమ్మూరి హైమావతి

